


బాలానగర్ శోభనా సెంటర్‌లో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



మాధవరం కృష్ణారావును ఆశీర్వదించండి

● ఎన్నికల రోడ్‌షోలో మంత్రి కేటీఆర్ ● నిత్యం ప్రజల్లో ఉండే వ్యక్తి కృష్ణారావు ● భారీగా తరలివచ్చిన కార్యకర్తలు

కూకట్‌పల్లి: సమర్థవంతమన పాలన అందించడానికి దృఢ సంకల్పంతో ఉన్న నాయకుడు కేసీఆర్ సారథ్యంలోనే తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా, శాంతియుతంగా ఉంటుందని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేసీఆర్ అన్నారు. గురువారం కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావుకు మద్దతుగా పర్వత్‌నగర్ చౌరస్తా నుంచి మోతీనగర్ చౌరస్తా మీదుగా రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందనగర్ చౌరస్తాలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. మహిళలకు గ్యాస్ ధర 400 మాత్రమే చెల్లించి గ్యాస్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సౌభాగ్య లక్ష్మి పేరిట ప్రతి మహిళకు రూ.3 వేలు ఖాతాలో జమ చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్‌రూమ్ అందజేస్తామన్నారు. స్థానికంగా అందుబాటులో ఉండే మాధవరం కృష్ణారావును ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

సర్వే నం.18లోని ప్రభుత్వ స్థలంలో ఉర్దూ పాఠశాల నిర్మిస్తాం...

◆ అల్లాపూర్ జీకే పాయింట్ చౌరస్తాలో మాట్లాడుతూ... అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్‌రూమ్ అందజేస్తామన్నారు. సర్వే నం.18లోని ప్రభుత్వ స్థలంలో ఉర్దూ పాఠశాల, సున్నం చెరువు, కాముని చెరువు, మైసమ్మ చెరువుల సుందరీకరణ చేపడతామన్నారు. అదే విధంగా నాలా విస్తరణ చేపడతామన్నారు. 50 సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ నేతలు ఒక్క చాన్స్ అంటూ ఏ మొహం పెట్టుకొని వస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కార్పొరేటర్ సబిహా బేగం, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం...

◆ మూసాపేటలో మున్సిపల్ కార్యాలయం వద్ద రోడ్ షోలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ... 9 ఏళ్లలో కులం, మతం పేరుతో గొడవలు లేవని, ఆంధ్ర, కేరళ, కర్ణాటక, తెలంగాణ అని చూడకుండా అందరం కలిసి మెలిసి ఉన్నామన్నారు. చేసింది కొంచెమే అని ఇంకా అభివృద్ధి చేసుకునేది చాలా ఉందన్నారు. భారతదేశానికి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ ఎదిగిందన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్నబియ్యం ఇస్తామన్నారు.


మూసాపేటలో మంత్రి కేటీఆర్ రోడ్ షో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు, మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్‌కుమార్

శాంతి భద్రతలు పటిష్టంగా అమలు చేస్తున్నాం

కూకట్‌పల్లి: మంత్రి కేటీఆర్ సమక్షంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఉద్యమ నేత గొట్టిముక్కల పద్మారావు బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లో జరుగుతున్న అభివృద్ధిని పక్క రాష్ట్రాల నుంచి వచ్చి మెచ్చుకుంటుంటే ఇక్కడ ఉంటున్న ప్రతిపక్షలకు మాత్రం కనబడడం లేదా అని విమర్శించారు. తెలంగాణలో రక్షణతో పాటు శాంతి భద్రతలను పటిష్టంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కేపీహెచ్‌బీ బస్టాప్‌లో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్న మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలానగర్ శోభనా సెంటర్ గులాబీమయం






కూకట్‌పల్లి: బాలానగర్ డివిజన్‌లోని శోభనా సెంటర్‌లో రోడ్‌షోలో భాగంగా మంత్రి కేటీఆర్ మాట్లాడారు. సినీస్టార్ రజనీకాంత్ హైదరాబాద్ అభివృద్ధి చూసి కితాబు ఇచ్చారని అన్నారు. ఇంద్రానగర్, దిల్‌కుషనగర్‌లో ప్రజలకు కావాల్సిన అన్ని రకాల మౌలిక వసతుల కల్పనను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎంతో కృషి చేశారన్నారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్నబియ్యం ఇస్తామని పేర్కొన్నారు. అదే విధంగా రూ.400 గ్యాస్ సిలిండర్ అందజేస్తామని తెలిపారు.



అయ్యప్ప మండల దీక్షలు ప్రారంభం


అన్నదానంలో పాల్గొన్న ఆలయ ధర్మకర్త వడ్డేపల్లి రాజేశ్వరరావు


మండల దీక్ష పూజలు చేస్తున్న అరుణ్ గురుస్వామి

కూకట్‌పల్లి: వివేకానందనగర్ శ్రీఅయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప మండల దీక్షను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం అరుణ్ గురుస్వామి ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పుష్పాభిషేకం, గజారోహణ చేశారు. అనంతరం అన్న సమారాధన ప్రారంభించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అయ్యప్పస్వామి భజనలు, కీర్తనలు ఆలపించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

సదర్ ఉత్సవాలు

మోతీనగర్: సదర్ సమ్మేళన ఉత్సవాలు సంస్కృతి సంప్రదాయాలను నేటి తరాలకు అందించిన వారమవుతామని బండారి ఐశ్వర్య చంద్రయాదవ్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి అల్లాపూర్ డివిజన్ అవంతినగర్ కాలనీలో తన్మయ్ యాదవ్, తరుణ్‌యాదవ్ ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దున్నపోతుల విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బండారి సుశీల్‌కుమార్ యాదవ్, బండ రాజుయాదవ్, నాయకులు అక్షిత్, వరుణ్, ధనుష్ రెడ్డి, వరుణ్ కుమార్, సందీప్ యాదవ్, జయ, ఉత్తేజ్, సన్నీ, వరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సదర్ ఉత్సవాల్లో దున్నపోతులపై విన్యాసాలు

ఘనంగా జాతీయ పత్రిక దినోత్సవం

మోతీనగర్: ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉండటమే విలేకరుల పాత్ర అని పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహమ్మద్ జాహెద్ షరీఫ్ బాబా పేర్కొన్నారు. గురువారం జాతీయ పత్రిక దినోత్సవం సందర్భంగా అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్‌లో స్థానిక సీనియర్ విలేకరులను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు మార్నేని ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా పాత్రికేయుడిగా విధులు నిర్వహిస్తూ అందరిలో ఒకరిగా ఉంటూ సమస్యలను పరిష్కరించే దిశలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటున్నామని తెలిపారు. మమ్మల్ని అందరూ గౌరవించడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ రాజు, బ్రహ్మ ప్రసాద్, విలేకరులు మార్నేని ప్రవీణ్ కుమార్, తమ్మలి రమేష్, నెల్లుట్ల కిరణ్‌కుమార్, ఆర్ వేణుగోపాల కృష్ణ, ఎల్ల రాముయాదవ్, కొండయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



పాత్రికేయులను సన్మానిస్తున్న మహమ్మద్ జాహెద్ షరీఫ్ బాబా

బహుళ అంతస్తుల నిర్మాణం..

పక్క ఇళ్లకు ప్రమాదం!


మల్లన్న స్వామి ఆలయం వెనుక కడుతున్న బహుళ అంతస్తు నిర్మాణం

మూసాపేట: మూసాపేట యాదవబస్తీలోని మల్లన్న స్వామి ఆలయం వెనుక భాగంలో బహుళ అంతస్తుల భవన నిర్మాణంతో చుట్టుపక్కల ఉన్న ఇళ్లు దెబ్బతింటున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గురువారం పిల్లర్ నిర్మాణం కోసం రాయి పగుల గొడుతుండటంతో పక్కన ఉన్న ఇంటి లోపల బొక్క పడింది. పురాతనమైన ఇళ్లు కావటంతో అప్పట్లో రాయి పైనే నిర్మాణం చేశారు. భవన నిర్మాణ యజమానులు రాయిని పగుల గొడుతుండటంతో ఆ ఇల్లు కూలిపోయే ప్రమాదం ఉంది. అంతేకాక ఇంటికి పగుళ్లు కూడా ఏర్పడ్డాయని అన్నారు. తమ ఇంటికి కొద్ది స్థలం వదిలేసి కట్టుకోవాలని కోరుతున్నారు. ఇంటికి సమీపించి చేయటం వల్ల ఇంటికి ప్రమాదం ఉందని భయాందోళన చెందుతున్నారు.

సైఫాబాద్ సైన్స్ కాలేజీలో ఇండక్షన్ ప్రోగ్రామ్

బంజారాహిల్స్: యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ సైఫాబాద్‌లో పీజీ విద్యార్థులకు గురువారం ఇండక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఓయూ జెనిటిక్స్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ కవి కిషోర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యూజీసీ, ఓయూ ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఈ కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కరోనా తర్వాత ప్రజల్లో సైన్స్ మీద చాలా అవగాహన వచ్చిందని అలాగే ఔషద మొక్కలపై కూడా ఆలోచించే స్థాయికి ఎదిగారన్నారు. మెడికల్ ప్లాంట్స్‌తో ఎన్నో రోగాలు నయం చేయగలమన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ జె. లక్ష్మన్ నాయక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, డాక్టర్ జగదీష్, వాసవి పాల్గొన్నారు.

వాకింగ్‌తోనే మధుమేహ వ్యాధి నియంత్రణ

హిమాయత్‌నగర్: నిరంతరం వాకింగ్ చేయడం వల్ల మధుమేహ వ్యాధి నియంత్రణలో ఉంటుందని ఉస్మానియా ఆసుపత్రి సీనియర్ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ రాకేశ్ సహాయ్ అన్నారు. నడక ద్వారా ప్రతి ఒక్కరూ మధుమేహ వ్యాధిని నియంత్రించుకోవాలన్నారు. ఈ మేరకు వరల్డ్ డయాబెటిస్ డేను పురస్కరించుకుని గురువారం నగరంలో ఐడియా క్లినిక్స్ ఆధ్వర్యంలో 5 కే వాక్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాకేశ్ సహాయ్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా డయాబెటిస్‌పై ప్రజలకు అవగాహన పెంపొందించాలన్నారు. వరల్డ్ డయాబెటిస్ డే ను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. చాలామంది షుగర్ బాధితులు ఎప్పటికప్పుడు షుగర్ చెక్ చేసుకోకుండా సమస్యలు కొని తెచ్చుకుంటున్నారన్నారు. ఐడియా క్లినిక్స్ నిర్వాహకులు ఇంటికి వచ్చి కళ్లు, పాదాలు, గుండె, మెదడు, రక్త పరీక్షలు, యూరిన్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు


కూకట్‌పల్లి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కళాశాల లైబ్రేరియన్ కరుణ తెలిపారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులకు ఉపయోగపడే అనేక రకాల పుస్తకాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన వివిధ పుస్తకాలు, వివిధ జర్నల్స్‌లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డా. భవాని మాట్లాడుతూ... కళాశాలలో ఇటువంటి ప్రదర్శనల వల్ల విద్యార్థుల్లో పఠనాసక్తి పెరుగుతుందన్నారు. ఇటువంటి వాటిని విద్యార్థులు చక్కగా వినియోగించుకోవాలని అన్నారు. లైబ్రేరియన్ కరుణ మాట్లాడుతూ.. గ్రంథాలయ పితామహుడు ఎస్ఎస్ రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్య సేవలను స్మరిస్తూ ప్రతి సంవత్సరం నవంబర్ 14 నుంచి వారం పాటు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించుకోవటం జరుగుతుందన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు తిరుపతిరావు

మోతీనగర్: యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాల్య దశలోనే ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహమ్మద్ జాహెద్ షరీఫ్ బాబా పేర్కొన్నారు. ఈగల ప్రసాద్ తేజ దంపతుల కుమారుడు ఈగల తిరుపతిరావు ఇటీవల బెంగుళూరులో జరిగిన జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం పొందారు. ఈ నెల 20, 21వ తేదీల్లో ఇంటర్నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు కిరిజిస్తాన్ బయల్దేరనున్నారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగంతో పాటు దాతలు మహమ్మద్ జాహెద్ షరీఫ్ బాబా, జి. లక్ష్మణ్ గుప్త, రాంబాబు, డేనియల్ మిత్రబృందం ఆర్థిక సాయం అందజేశారు.


తిరుపతిరావుకు ఆర్థిక సాయం అందజేస్తున్న జాహెద్ షరీఫ్‌బాబా

ఈ సందర్భంగా బాబా మాట్లాడుతూ... నిరుపేద కుటుంబంలో పుట్టి ప్రపంచ స్థాయిలో జరిగే వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు వెళ్లడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇంటర్నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కూడా ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చుకుంటాడనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బి.శంకర్ గంగపుత్ర, వి.శ్రీనివాస్‌యాదవ్, యాదిశ్రీ బ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే సమస్యలన్నీ పరిష్కరిస్తా

కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్


కూకట్‌పల్లిలో సర్దార్ పాపారాయుడు, వడ్డేపల్లి నర్సింగరావు, అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న బండి రమేష్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్, కో-ఆర్డినేటర్ సత్యం శ్రీరంగం సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావుతో కలిసి గురువారం కూకట్‌పల్లిలోని సర్దార్ పాపారాయుడు, వడ్డేపల్లి నర్సింగరావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీకాకుళం బస్తీ, విజ్ఞాన్‌పురి, మైత్రినగర్, సాయిబాబానగర్‌ల మీదుగా దయార్‌గూడ వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అందించే ఆరు గ్యారంటీ పథకాలపై ఓటర్లకు అవగాహన కల్పించారు.

◆ ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె చేసి ప్రాణాలు పోగొట్టుకున్నా ఈ ప్రభుత్వం కనికరం చూపలేదన్నారు. ఎన్నికలు రాగానే ప్రభుత్వంలో విలీనం చేస్తామని మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. ఆర్టీసీలో భూములు ఎక్కువ ఉన్నాయనే ఉద్దేశంతో విలీనం చేశారని విమర్శించారు. అప్పుడు ప్రభుత్వ భూములు, ఇప్పుడు ఆర్టీసీ భూములు అమ్ముతారని ఆరోపించారు.

◆ అవినీతి పాలనలో ప్రజలకు కనీసం మౌలిక వసతులు లేవన్నారు. నియోజకవర్గంలో చాలా సమస్యలు ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపిస్తే దశలవారీగా సమస్యలన్నిటినీ తీరుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మేకల రమేష్, సీనియర్ నాయకులు సురేష్, రమేష్, గోపి, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో ఏపీ కాంగ్రెస్ నేతల ప్రచారం..

కూకట్‌పల్లి: తెలంగాణలో జరుగుతున్న ఎన్నికల సందర్భంగా ఏపీ ఏలూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రాంమోహన్‌రావు, పొన్నూరు నియోజకవర్గం నుంచి జక్కుల శ్రీనివాస్ గురువారం కూకట్‌పల్లి నియోజకవర్గానికి వచ్చారు. ఈ సందర్భంగా సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రచారం చేయటానికి విచ్చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ గెలుపు కోసం మీలాంటి నాయకులు చాలా అవసరమన్నారు. తన విజయానికి పోరాడుతున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నానని పేర్కొన్నారు.


ప్రచారానికి వచ్చిన ఏపీ కాంగ్రెస్ నాయకులకు ధన్యవాదాలు తెలుపుతున్న బండి రమేష్

గెలిపిస్తే సమస్యలు పరిష్కరిస్తా

కూకట్‌పల్లి: బాలాజీనగర్ డివిజన్ వివేక్‌నగర్‌లో వేంచేసియున్న శ్రీద్వాదశ జ్యోతిర్లింగ భువనేశ్వరి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన బీజేపీ, జనసేన పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వివేక్‌నగర్, బాలాజీనగర్, ఓమిని ఆసుపత్రి సర్వీస్‌రోడ్డు, విజయదుర్గ టిఫిన్ సెంటర్, ఎల్ఐజీ మెయిన్ రోడ్డు వరకు పాదయాత్ర కొనసాగించారు. ఈసారి అందరూ ఆలోచించి తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. గెలిపిస్తే కూకట్‌పల్లి నియోజకవర్గ సమస్యలన్నీ పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజలింగం, సూర్యారావు, వినోద్ గౌడ్, పద్మయ్య, గంధం రాజు, సత్యనారాయణ, ఆకుల రాము, నాగరాజు, కొల్లా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పైసా లెక్కిస్తాం..

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఎన్నికల ఖర్చు రూ. 40లక్షలు మించరాదని, నిబంధనను అతిక్రమించి ఎలాంటి బిల్లులు చూపకుండా ఎన్నికల్లో ఖర్చు చేస్తే కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ జిల్లా అభ్యర్థుల ఎన్నికల వ్యయ పర్యవేక్షణ అధికారి సుభోద్ సింగ్ అన్నారు. పోటీ చేసిన ఏ అభ్యర్థి అయినా నిబంధనలు అతిక్రమిస్తే తగిన చర్యలు తీసుకుంటామని, ఖర్చుల విషయంలో అభ్యర్థులు ఎన్నికల నియమావళికి లోబడి వ్యవహరించాలని సూచించారు. గురువారం ముషీరాబాద్ ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లకు ఎన్నికల ఖర్చు, విధి విధానాలు అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో సుభోద్‌సింగ్, ముషీరాబాద్ ఆర్వో వి. లక్ష్మి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, ఏజెంట్లు తమ సందేహాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఎన్నికల బరిలో ఉన్న ప్రతి అభ్యర్థి ప్రత్యేక ఖాతా ద్వారానే ఎన్నికలకు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి అభ్యర్థిపై ఎన్నికల కమిషన్ నిఘా ఉంటుందని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పారదర్శకంగా ఎన్నికల జరిగే విధంగా అభ్యర్థులందరూ సహకరించాలన్నారు. సమావేశంలో ఎన్నికల వ్యయ పర్యవేక్షణ అసిస్టెంట్ అధికారి వంశీకృష్ణతో పాటు 28 మంది అభ్యర్థులు పాల్గొన్నారు.

ప్రధాన పార్టీల అభ్యర్థులు గైర్హాజరు...

ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీతోపాటు సీపీఎం, బీఎస్పీ తదితర అభ్యర్థులు ఈ సమావేశానికి గైర్హాజరు కావడం గమనార్హం.

'మాదిగ జాతిని తాకట్టు పెట్టాడు '

పంజగుట్ట: పరేడ్‌గ్రౌండ్స్‌లో జరిగిన మాదిగల విశ్వరూప మహాసభ ద్వారా దక్షిణాది రాష్ట్రాల మాదిగ ఓట్లను బీజేపీకి వేయిస్తానని మంద కృష్ణ మాదిగ జాతిని మోదీ కాళ్ల వద్ద తాకట్టుపెట్టాడని ఎమ్ఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ .. సభ మొత్తం ఒకరినొకరు కీర్తించుకోవడంతోనే సరిపోయిందని, సభలో తాను ఎస్సీ రిజర్వేషన్ కోసం కమిటీ వేస్తానని మోదీ ఎక్కడా చెప్పలేదన్నారు. అయినా బీజేపీ ఎన్నో కీలక బిల్లులను ఎలాంటి కమిటీలు లేకుండా ఆమోదించుకుందని కేవలం ఎస్సీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం తెలిపేందుకు కమిటీ ఎందుకని ప్రశ్నించారు. ఎమ్మార్పీఎస్‌లో లక్షలాది మంది కార్యకర్తలకు, బలిదానాలకు సంబంధంలేనట్లు కేవలం ఒక్క వ్యక్తి మాత్రమే ఉద్యమం చేసినట్లు ప్రకటించుకున్నాడని ఆరోపించారు. మోదీని చూడగానే కన్నీళ్లు పెట్టుకున్నావంటే ముందే బీజేపీ నాయకులతో మాట్లాడి ఎన్నికల స్టంట్ రూపొందించినట్లు అర్థమౌతుందన్నారు. తెలంగాణలో అన్ని సర్వేలు కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యేపోటీ అని చెబుతుండగా ఆ రెండు పార్టీల్లో ఏదైనా అధికారంలోకి వస్తే వారు మాదిగజాతిని మరింత అణగదొక్కరన్న నమ్మకం ఏమిటని ప్రశ్నించారు. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని దాన్ని వారు ఇష్టం వచ్చినట్లు వినియోగించుకోవాలని సూచించారు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదింపచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాదిగ రాజకీయ పోరాట సమితి అధ్యక్షులు బి.ఎన్.రమేష్, నర్సింహ్మ, బోయ ప్రవీణ్, ఎ.విజయ్‌కుమార్, మాతంగి ఓదెలు, శ్రీధర్, రమేష్, శంకర్, చిరంజీవి పాల్గొన్నారు.

పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లుల పాత్ర కీలకం

చిక్కడపల్లి: పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంతో తల్లుల పాత్ర కీలకమని ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. జగతి ఆర్ట్స్ ఆధ్వర్యంలో గురువారం త్యాగరాయ గానసభ ప్రధాన వేదికలో చిల్డ్రన్స్ ఫెస్ట్– 2023 శీర్షికతో నిర్వహించిన చిల్డ్రన్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భం మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులన్నారు. ఫెస్ట్‌లో భాగంగా చిన్నారుల నృత్యప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంపిక చేసిన వివిధ రంగాల ప్రముఖులకు సేవారత్న, నృత్యరత్న, విద్యారత్న, అవార్డులను ప్రదానం చేసి సన్మానించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ నీలిమ, నిర్వాహక సంస్థ వ్యవస్థాపకురాలు అర్.శ్రీలక్ష్మీ, ప్రముఖులు వి.సుబ్రహ్మణ్యం, ఎస్.శ్రావణ్‌కుమార్, పీఎస్ మూర్తి, బి.అపర్ణ, కేవీ చారి, లంకా లక్ష్మీనారాయణ, జి.వెంకటరెడ్డి, అన్నపూర్ణ, జి.లక్ష్మయ్య, పి.విజయలక్ష్మి, విజయ్‌కుమార్, సైదులు, భూదేవి, కాంచన, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.